క్లుప్తంగా

బొగ్గరంలో సీసీ కెమెరాల ఏర్పాటు

ఈపూరు : పల్నాడు జిల్లా ఎస్పీ సూచనల మేరకు మండలంలోని బొగ్గరంలో గురువారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. ఇప్పటికే కొండ్రముట్ల జంక్షన్, అంగలూరు, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేశామని చెప్పారు. మండలంలోని ముఖ్యమైన కూడళ్ల వద్ద త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

చిలకలూరిపేట టౌన్: పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పల్నాడు జిల్లా ఫాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బ్రదర్ నందమూరి క్రిస్టర్ చెప్పారు. పట్టణంలోని ఏసుక్రీస్తు శాంతి నిలయంలో గురువారం జిల్లా స్థాయి పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల్ని తన దృష్టికి తేవాలని కోరారు. అక్టోబరులో జరిగే నూతన కమిటీ నియామకంపై పలు సూచనలు చేశారు. సమావేశానికి జిల్లాలోని 20 మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం కలిగి ఉన్న కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి 10 తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ వీరేంద్రబాబు గురువారం తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 10 మద్యం బాటిళ్లు కలిగి ఉండటంతో జుజ్జూరి ప్రదీప్‌ను అరెస్ట్ చేశామని చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

పిల్లల్లో ఆరోగ్య సమస్యలపై అప్రమత్తత అవసరం

నరసరావుపేట: చిన్న పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ డీఎండీహెచ్‌వో డాక్టర్ జి.చంద్రశేఖర్ సూచించారు. వ్యాధుల్ని త్వరితగతిన గుర్తించి తగిన వైద్యం చేయాలని చెప్పారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్ కార్యక్రమం, ఫోర్‌డీ స్క్రీనింగ్ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు 330 మంది హాజరయ్యారు. పుట్టుకతో వచ్చే లోపాలు, చిన్న పిల్లలో వచ్చే వ్యాధులు, లోపాలు, చికిత్సలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డెప్యూటీ డీఎండీహెచ్‌వో చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డీఈఐసీ) నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఎంసీహెచ్ (మాటెర్నల్ అండ్ చైల్డ్ హెల్త్) హాస్పిటల్‌లో ఉందని చెప్పారు. ఇందులో పుట్టుక నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్నవారి వరకు అన్ని సమస్యలకు వైద్యం లభిస్తుందని తెలిపారు. పీడియాట్రీషిన్, మెడికల్ ఆఫీసర్, డెంటల్ మెడికల్ ఆఫీసర్, ఫిజియోథెరపిస్ట్, ఆడియాలజిస్ట్, సైకాలాజిస్టు, ఆప్టోమెట్రిస్ట్, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, సోషల్ వర్కర్ తదితర సిబ్బంది రోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. అనంతరం జిల్లా వైద్యాధికారిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.రవిని సభకు పరిచయం చేశారు.

మన బడి- నాడు నేడు పనుల్ని వేగవంతం చేయండి

నాదెండ్ల: మన బడి నాడు - నేడు పనుల్ని వేగవంతం చేయాలని ఎంఈవోలు ఐ ఆంజనేయులు, ఈమని కృష్ణారెడ్డి తెలిపారు. ఫేజ్- 2లో నిధుల్ని ఖర్చు చేయడంలో మండలం ఎంతో వెనుకబడి ఉందని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నాడు - నేడు పనులపై హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ నాడు - నేడు ఫేజ్-2లో ఎంపికైన పాఠశాలల్లో పనులు నత్తనడకన నడుస్తున్నాయని, వేగవంతం చేసి నిధులు వెచ్చించడంతో ముందుండాలని ఆదేశించారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తి చేసి బిల్లుల్ని అప్‌లోడ్ చేయాలని చెప్పారు. హెచ్ఎం లాగిన్‌లో కాని పక్షంలో ఫీల్డ్ ఇంజనీర్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. 11 - 19 ఏళ్ల ఆడపిల్లల్లో రక్తహీనత నివారణకు ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు ప్రతిరోజూ ఇవ్వాలని తెలిపారు. బంగారు తల్లి పథకానికి సంబంధించి ఒక్కో విద్యార్థిని నుంచి రూ.15 వసూలు చేసి వారికి ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు వేసే కార్డును అందించాలని చెప్పారు. ఈ మొత్తాన్ని డీఈవో అకౌంట్‌లో జమ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఫీల్డ్ ఇంజనీర్ అర్వింద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల్లో సంతోషాలు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



గణపవరంలో నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలు తెలిసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని, దేశంలో ఎక్కడాలేని విధంగా అన్ని కుటుంబాల సంక్షేమం, అభివృద్ధికి విశేషమైన పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గణపవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం తొమ్మిదో రోజు నిర్వహించారు. రాజీవ్‌గాంధీ కాలనీ నాలుగు ఎకరాల నుంచి జాతీయ రహదారి చివరి వరకూ గడప గడపకు వెళ్లారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముగింట్లోకి తెచ్చారని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని పథకాల్ని మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెద్దఎత్తున ఉద్యోగాల కల్పన చేశారని పేర్కొన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యా దీవెన, విద్యా వసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహనమిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారని మంత్రి వివరించారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందని చెప్పారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్ని గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు విడదల గోపి, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాట్రు రమేష్, కౌన్సిలర్లు పిల్లి సాగర్‌బాబు, షేక్ ఆదాంవలి, తులం సుధాకర్, నాలుగో వార్డు ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు బొంతా బాబు, మర్రి దుర్గారావు, మండ్రు జ్ఞానయ్య, బొంతా యోహాను, నాగళ్ల సాంబశివరావు, బొంతా మరియబాబు, పుల్లగూర రమేష్, షేక్ అహమ్మద్, నల్ల నాసరయ్య, లింగారెడ్డి, పిచ్చిబాబు, పల్లపాటి వెంకటేశ్వర్లు, పెదపోలేరు, పుల్లగూర రమేష్, మీరావలి, నేలపాటి శ్రీను, గోళ్ల శ్రీను, వజ్జా బ్రహ్మయ్య, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పూడి రామారావు, జెడ్పీ స్కూల్ పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, కె. నాగయ్య, ఎ. సుబ్రహ్మణ్యం, సింగు సత్యనారాయణ, ఇస్రాయేలు, ఎస్. చార్లెస్, కాట్రు రోశయ్య, విడదల కమలేంద్ర, హరనాథబాబు, అవ్వారు అన్నపుశెట్టి పాల్గొన్నారు.

జయ జనార్దనా.. రాధికాపతే!

- నందడిగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- చెంఘీజ్‌ఖాన్‌పేట బాలకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చెంఘీజ్‌ఖాన్‌పేట ఆలయంలోని వెన్నముద్దల బాలకృష్ణుడు



బరంపేటలోని ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో రాధాగోవిందులు

యడ్లపాడు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చెంఘీజ్‌ఖాన్‌పేటలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీరాజ్యలక్ష్మి సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువైన నవనీత వెన్నముద్దల బాలకృష్ణునికి ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి సత్యనారాయణచార్యులు, రాఘవేంద్ర ఆధ్వర్యంలో వేకువజామునే పంచామృత అభిషేకాలు, 7 నుంచి 7.30 గంటల వరకు స్వామి నిజరూపదర్శనం, విశేష అలంకరణ, 9 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తుల్ని గరుణ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. వీధుల్లోకి సర్వాంగ సుందరంగా అలంకారకృతులై దర్శన మిచ్చిన దేవతామూర్తులకు భక్తులు కన్నులారా తిలకించి నీరువారుపోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చే పోయే భక్తులతో ఆలయంతో పాటు గ్రామంలో సందడి నెలకొంది. సాయంత్రం 6.30 గంటలకు ఉట్టి మహోత్సవాన్ని తుకువ వంశీయులు ప్రారంభించగా, గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

రంగనాయక స్వామి ఆలయంలో గోకులాష్టమి వేడుకలు

యడ్లపాడు మండలంలోని సొలసలో ఉన్న శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు స్వామికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించి పూజలు చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవాన్ని ఏర్పాటు చేయగా, గ్రామస్తులు ఆనందోత్సవాలతో పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో జన్మాష్టమి వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్ర మందిరం ఇస్కాన్ ఆలయంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 7.30గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సర్వదర్శనం, ప్రసాద వితరణ గావించారు. హరేకృష్ణ నామస్మరణతో ఆలయం మారుమోగింది. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మూలమూర్తులను దర్శించుకొని పూజలు జరిపారు.

వైభవంగా నిమజ్జనం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి, శానంపూడి గ్రామాల్లో యాదవ రాజులు ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విగ్రహాల్ని మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగించారు. మండలంలోని కనమర్లపూడిలో మర్రి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడు విగ్రహాన్ని మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించి, అనంతరం నిమజ్జనం చేశారు. ఉట్టి కొట్టే ఉత్సవాన్ని కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా చిన్నారులు శ్రీకృష్ణుడు వేషధారణతో సందడి చేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

నాదెండ్ల: గణపవరంలోని చారిత్రక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. కృష్ణాష్టమి సందర్భంగా గత మూడు రోజులుగా బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చివరిరోజు గురువారం ఆలయ పూజారి కేశవాచార్యులు, ధర్మకర్తలు వెంకట శ్రీవత్సవ, అగస్త్య, శరవణకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి ఆలయంలో శాంతి కల్యాణం జరిపారు. గురువారం ఉదయం స్వామికి చక్రస్నానం అనంతరం ఊరేగింపు, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ద్వాదశి ప్రదక్షిణల అనంతరం పవళింపు సేవ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అంగరంగ వైభవంగా వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామిలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం వేణుగోపాలస్వామి మూల విరాట్‌కి వెండి తొడుపును చేయించిన దాత పిట్టముసుల లింగరాజును ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. లోక కల్యాణార్థం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాల్ని ఊరేగించారు. కనపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చేతుల మీదుగా విరాళాన్ని అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి లింగంగుంట్లకు చెందిన భవనం వెంకాయమ్మ ఆమె కుమారులు ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా విరాళం మొత్తాన్ని ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డికి దాతలు అందించారు. తమ తండ్రి, తిరుమల ట్రావెల్స్ నిర్వాహకులు భవనం కొండారెడ్డి జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేసినట్టు దాతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ సభ్యుడు మాలపాటి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో నిర్మల హైస్కూలు విద్యార్థుల సత్తా



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

వినుకొండ టౌన్: గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఆగస్టు 31న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడమేకాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్థానిక నిర్మల ఇంగ్లిష్ మీడియం పాఠశాల సూపరింటెండెంట్ సిస్టర్ క్యాస్పర్, ప్రిన్సిపాల్ సిస్టర్ రాణి గోవింద్ పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్ని పాఠశాలలో గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 9వ విద్యార్థిని శివపార్వతి 300 మీటర్లలో రెండో స్థానాన్ని, 100 మీటర్లలో మూడో స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. 7వ తరగతి విద్యార్థి వెంకటరెడ్డి 60 మీటర్లలో మూడో స్థానాన్ని, టి. వైష్ణవి 600మీటర్లలో మూడవ స్థానాన్ని గెలుచుకున్నట్లు చెప్పారు. ఏలూరులో ఈ నెల 20 నుంచి 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు శివపార్వతి అర్హత పొందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుల్ని సన్మానించారు. కార్యక్రమంలో సిస్టర్ చిన్ని, సిస్టర్ బెనెడిక్ట్, వ్యాయామ ఉపాధ్యాయులు, అథ్లెటిక్ కోచ్ డి. అశోక్, పీఈటీలు శ్రీను, జోనానాయక్, వంశీ, సైదమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ఈ-పంట నమోదే ప్రామాణికం

నరసరావుపేట రూరల్: రైతు సంక్షేమానికి ఈ-పంట నమోదును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని పాలపాడు రైతు భరోసా కేంద్రంలో ఈ-పంట నమోదును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులంతా వివరాల్ని ఈ-పంటలో నమోదు చేసుకోవాలని తెలిపారు. దీంతోపాటు తప్పకుండా ఈకేవైసీ కూడా చేసుకోవాలని సూచించారు. ఈ-పంట నమోదు వల్ల ప్రభుత్వం అమలుచేసే పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చని వివరించారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, రుణాలతో పాటు పంట నష్టపరిహారం, ఉత్పత్తుల కొనుగోలుకు కూడా ఉపకరిస్తుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఈ- పంట నమోదును చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, ఎంఏవో అరుణచంద్ర, ఏఈవో బ్రహ్మయ్య, వీఏఏ బోస్, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యంతోనే బాలుడి మృతి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకుల ఆరోపణ
- కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి వినతి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్, నాయకులు

నరసరావుపేట: బాలుడి మృతికి కారకుడైన డాక్టర్ బి.సాయిరామ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రాష్ట్ర పౌరహక్కుల సంఘ రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఎన్‌జీవో హోమ్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆరోగ్య సమస్యపై తన వద్దకు తీసుకొచ్చిన బాలుడికి సక్రమమైన వైద్యం నిర్వహించకుండా అతడి మరణానికి డాక్టర్ కారకుడయ్యాడని తెలిపారు. ఇప్పుడు పోలీసు కేసు తప్పించుకునేందుకు రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నాడని ఆరోపించారు. వెంటనే అతడిపై కేసు నమోదు చేసి బాలుడి తల్లితండ్రులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు నల్లపాటి రామారావు, షేక్ మస్తాన్‌వలి, ఏపీ బీసీ సంక్షేమ సంఘ అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, ప్రజాకళా మండలి నాయకుడు ఉన్నం నాగేశ్వరరావు, రెడ్డిబోయిన విజయకుమార్, పిడుగు విజయబాబు పాల్గొన్నారు.

ఆలయ శంకుస్థాపన ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపై ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన ఆహ్వాన పత్రికల్ని వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు ఆవిష్కరించారు. స్థానిక ఘాట్ రోడ్డు వద్ద గురువారం నిర్వహించిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం ఈ నెల 8న జరగనున్న నేపథ్యంలో భక్తులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పెండేల పుల్లారావు, అధ్యక్షుడు పులిపాటి రామారావు, సంఘం సభ్యులు జాజుల మాల్యాద్రి, గంధం బాలిరెడ్డి, దండు చెన్నయ్య, ములకా రామతులసిరెడ్డి, గజవల్లి పవన్, టి.బాబు పాల్గొన్నారు.

శకుంతల జనరల్, గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్ ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లో శకుంతల జనరల్, గ్యాస్ట్రో లివర్‌కేర్ (డాక్టర్ పీఎస్ దత్ హాస్పిటల్)ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యేకు నిర్వాహకులు డాక్టర్ పాటిమళ్ల నరేంద్రనాథ్‌దత్, డాక్టర్ ఐలా శ్రీనివాస్ ఘనంగా స్వాగతం పలికారు. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి హాస్పిటల్‌లోని పలు విభాగాల్ని పరిశీలించారు. కడుపులో అల్సర్, తేన్పులు, అజీర్తి, గ్యాస్, విరోచనాలు, మలబద్ధకం, నులిపురుగులు, రక్తపు వాంతులు, రక్తహీనత, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఆహారం మింగుడు పడకపోవడం తదితర జీర్ణకోశ సమస్యలకు అత్యాధునికమైన పరికరాలు, వసతులతో వైద్యసేవలు అందించనున్నట్లు డాక్టర్లు వెల్లడించారు. కార్యక్రమానికి ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్లు వరబాబు, లలిత్ సాగర్, మోహన్‌శేషు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, లంకా ప్రత్యూష, జిల్లా కోర్టు ప్రాసిక్యూటర్ కాకుమాను బాలహనుమంతారెడ్డి, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఈ.ఎం.స్వామి, విప్పల దానారెడ్డి తదితర పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

అధిక ధరలకు గ్యాస్ విక్రయాలపై విచారణ



పేరూరుపాడులో వినియోగదారులను విచారిస్తున్న అధికారులు

బొల్లాపల్లి: గ్యాస్‌ను ఏజెన్సీలు అధిక ధరలకు విక్రయిస్తున్నాయనే ఫిర్యాదు మేరకు మండలంలోని పేరూరుపాడులో గురువారం అధికారులు విచారణ జరిపారు. గ్రామంలో వినియోగదారుల్ని సీఎస్ డీటీ లక్ష్మణరావు, స్థానిక వీఆర్వో షేక్ నన్నేసా కలసి విచారించారు. ఈ సందర్భంగా సీఎస్ డీటీ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం విచారణ నిర్వహించామని, నివేదికను పౌరసరఫరాల జిల్లా అధికారికి అందజేస్తామని తెలిపారు. గత నెల 29న గ్యాస్ సిలెండర్ ధర రూ. 200 తగ్గించినా ఆ రేటు ప్రకారం ఏజెన్సీలు విక్రయాలు జరపడం లేదని కలెక్టర్‌కు వినియోగదారులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జగనన్న పాల వెల్లువ రుణాలకు 174 దరఖాస్తులు

శావల్యాపురం: జగనన్న పాల వెల్లువ రుణాల్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. అమూల్ పాల సెంటర్లకు పాలు పోసే పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం రుణామేళా కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందని తెలిపారు. ఒక్కో పాడి రైతుకు రూ. 30 వేల నుంచి రూ.1.60 లక్షల వరకు రుణాన్ని తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా ఇవ్వనున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 174 అర్జీలు రైతుల నుంచి వచ్చాయని తెలిపారు. ఆసక్తి కలిగిన పాడి రైతులంతా వివరాలకు పశు వైద్యాధికారుల్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

మన గ్రోమార్ సెంటరులో తనిఖీలు

శావల్యాపురం: స్థానిక గ్రోమార్ సెంటరులో గురువారం తూనికలు కొలతలు అధికారి దేశినేని శివ శంకర్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగంగా గ్రోమార్ సెంటరులో ఎలక్ట్రానిక్ కాటా పనితీరు పరిశీలించామని తెలిపారు. ఎలాంటి తేడాలు లేవని చెప్పారు. తూనికలు కొలతల్లో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు సెంటర్ మేనేజర్ సురేంద్ర ఉన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న సూర్యప్రకాష్, బ్యాంక్ సిబ్బంది

వినుకొండ టౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ, పురోగతిలో బ్యాంక్ ఆఫ్ ఇండియ వినుకొండ శాఖ ముందుందని మేనేజర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బ్యాంక్ 118వ వ్యవస్థాపక దినోత్సవంతో పాటు వినుకొండ శాఖ 11వ వార్షికోత్సవ వేడుకల్ని గురువారం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, ఖాతాదారులకు, బ్యాంక్ సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాండ్ లార్డ్ అన్నాప్రగడ సూర్యప్రకాష్, అసిస్టెంట్ మేనేజర్ కె. భారత్, లాయర్ సైదారావు, ఎల్. అంజిరెడ్డి, వి. లింగమూర్తి, జాస్తి వెంకట్రావు, వై. సుధీర్, ఎం. జవహర్‌బాబు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర ఆదాయంపై సేంద్రియ రైతులు దృష్టి పెట్టాలి

యడ్లపాడు: సేంద్రియ రైతులంతా నిరంతర ఆదాయం (ఏటీఎం మోడల్) వచ్చే విధానాన్ని అవలంబించాలని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమలకుమారి తెలిపారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో గురువారం ప్రకృతి సాగు రైతులతో కలసి రైతు నరసింహారావు వేసిన ఏటీఎం మోడల్ పంట పొలాన్ని పరిశీలించారు. సాగు విధానం, అంతరసేద్యం, ఎరువుల వినియోగం తదితర అంశాల్ని రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులంతా ఏటీఎం మోడల్ విధానానికి మళ్లాలని ఆమె సూచించారు. ఎకరం పొలంలో ప్రధాన పంటగా మునగ, చిక్కుడు ,కంది, బంతి, వంగ, క్యారెట్, బీట్రూట్, ముల్లంగి సాగు చేసుకోవాలన్నారు. పంటల మధ్య భాగంలో తోటకూర, పాలకూర, చుక్కకూర, వంటి ఆకుకూరలు, మిరప, బంతి, ఆముదం, గట్లచుట్టు రక్షణ పంటగా జొన్న, సజ్జ, తీగజాతైన దోస ,బీర, బెండ, చిక్కుడు, టమాట, కంది పంటలను వేసుకోవాలని సూచించారు.

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ



కనమర్లపూడిలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఎంపీడీవో సీతారామయ్య, సిబ్బంది

శావల్యాపురం: పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. కనమర్లపూడి బీసీ కాలనీ అంగన్‌వాడీ సెంటరులో గురువారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో కూడిన ఆకుకూరలు, పప్పు దినుసులు, కోడి గుడ్లల్లో పోషకాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తన్నీరు భారతి, పీహెచ్‌సీ వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు వెంకాయమ్మ పాల్గొన్నారు.

నరసరావుపేట ఈస్ట్‌లో..

తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో మాణిక్యారావు తెలిపారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వరవకట్టలో గురువారం పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. మాణిక్యారావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.పార్వతి, అంగన్‌వాడీ పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం గర్భిణులు, బాలింతలకు శ్రేయస్కరమని డీఎం అండ్ హెచ్‌వో బి. రవి సూచించారు. మండలంలోని అన్నవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని, మునగ ఆకును ప్రతిరోజూ వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి. శశిదేవి, డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధిని దోచుకున్న గుర్తు తెలియని వ్యక్తులు

రొంపిచర్ల: వివాహ వేడుకను కవర్ చేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్న రాజ్ ఫొటోగ్రఫీ అధినేత పి.నాగరాజుపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసి రూ.10వేలు నగదు, ల్యాప్‌టాప్, ఇతర ఫొటోగ్రఫీ వస్తువుల్ని దోచుకెళ్లిన సంఘటన గురువారం తెల్లవారుజామున గోగులపాడు-కొనకంచివారిపాలెం మధ్య చోటుచేసుకుంది. బాధితుడు ఐ న్యూస్ ఛానల్ రిపోర్టర్‌గాను, పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్, నరసరావుపేట ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈపూరు మండలం కొచ్చెర్లలో వివాహ వేడుకను వీడియో తీసి, అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై నాగరాజు ఒంటరిగా నరసరావుపేటకు బయలుదేరారు. గోగులపాడు దాటి కొనకంచివారిపాలెం సమీపంలోకి రాగానే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై నాగరాజు వెంటబడి ఢీకొట్టి కింద పడేశారు. ఆయన వారి నుంచి తప్పించుకునేందుకు సమీపంలోని పొలాల్లోకి పరిగెత్తాడు. అయినప్పటికీ వదలకుండా వెంటపడి పట్టుకొని చేతులు, కర్రలతో కొట్టి జేబులోని రూ.10వేలు నగదు, ల్యాప్‌ట్యాప్ ఉన్న బ్యాగును తీసుకొని పరారయ్యారు. సంఘటనపై రొంపిచర్ల పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సురేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.